ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (మల్కిపురంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 29-4-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరణాగతి మార్గంలో ఈశ్వరుని ఇష్టమే మన ఇష్టం, ఆయన సంకల్పమే మన సంకల్పము అనుకొంటాము. భగవంతుని చేతిలో మనం కేవలం పనిముట్టుగా ఉంటాము. ఆయన స్వాధీనంలో జీవిస్తు ఉంటాము. శరణాగతిమార్గంలో జీవుడు స్వతంత్రుడు అవ్వడు. ఆయన ఎక్కడ నియమిస్తే జీవుడు అక్కడ ఉంటాడు. కేవలము తనను తాను అర్పించుకొని జీవిస్తూఉంటాడు. శరణాగతి మార్గానికి రామాయణంలో లక్ష్మణస్వామిని ఉదాహరణగా చెపుతారు. రామచంద్రమూర్తి అదుపు ఆజ్ఞలలో లక్ష్మణస్వామి ఉండేవారు. నువ్వు ఆలోచించి ఈపనిచేయమని నాతో చెప్పవద్దు. నీవు ఎలా చెపితే అలా చేస్తాను. నీవు ఎలా నియమిస్తే అలా నియమింపబడతాను అని లక్ష్మణస్వామి రామాయణంలో రామచంద్రమూర్తికి చెప్పినట్లు కనిపిస్తుంది. అది శరణాగతి లక్షణము.

మన పెద్దలు సైన్స్‌కు వ్యతిరేఖంగా ఏమీ చెప్పలేదు. వైజ్ఞానపరంగానే చెప్పారు. మనం అర్థంచేసుకోవటం సక్రమంగా అర్థంచేసుకోవాలి. కాళీయమర్దనంలో కృష్ణుడు ఆ పాముమీద డాన్స్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. దాని అర్థంఏమిటి అంటే కృష్ణుడు ఆ సర్పంయొక్క శిరోభాగంమీద ఉండి ఆ సర్పమును ఏవిధంగాఅయితే అణిచాడో అలాగే నీ ఇంద్రియాలను అణిచి వాటిని స్వాధీనం చేసుకొంటే ప్రకృతి నీకు స్వాధీనం అవుతుంది. అప్పుడు నీకు భగవదనుభవం కలుగుతుంది అని చెప్పటం. దీనిని పూర్వీకులు బొమ్మలు వేసి చూపించారు. మనం శాస్త్రీయపరంగా దీనిని అర్థంచేసుకోవాలి. మన హృదయంలో చైతన్యం ఉన్నప్పటికి, అది సిద్ధంగా ఉన్నప్పటికి ప్రకృతిలోనుండి మనం విడుదల పొందకపోతే బ్రహ్మానుభవం కలుగదు.

అవతరించినటువంటి దేవుడిని ఆరాధించటంవలన ప్రకృతిని జయించటం తేలిక అని చెప్పారు. ఒకనదిని దాటాలంటే పడవమీద వెళ్ళవచ్చు లేకపోతే ఈదుకొని నదిని దాటవచ్చు. ఒక ఆకారమును ఆశ్రయించి, ధ్యానించి తరించటం పడవమీద నదిని దాటటంవంటిది. ఆకారము లేకుండా సూటిగా బ్రహ్మమును చింతించి బ్రహ్మమును పొందటం ఈదుకొని నదిని దాటటంవంటిది. నిరాకారముకంటే సాకారమునుపట్టుకొని ప్రయత్నించటం తేలిక అని గీతలో చెప్పారు. ఏ మార్గములో ప్రయాణించినా మనిషి ప్రకృతి గుణాలను దాటివెళ్ళాలి.

భక్తులలోకూడా చాలామందికి బాహ్యమైన జీవితమేగాని మానసికమైన జీవితం ఉండదు. కేవలం శరీరపరంగా జీవించటమే. మానసికమైన జీవితం వారికి ఉండదు. ఒక శబ్దం మనం విన్నప్పుడు ఉన్నది ఉన్నట్లుగా అర్థంచేసుకోవాలంటే కొంత మానసికజీవితం ఉండాలి. కొంతమందికి మరణానంతర జీవితముమీద విశ్వాసం ఉండదు. అటువంటివారికి తత్వంచెప్పటం కష్టం. మనస్సులో వికాసము లేనివారికి భౌతికమైన మాటలే వారికి అర్థంకావు ఇంక ఆధ్యాత్మికమైన మాటలు వారికి ఏమి అర్థమవుతాయి. ప్రకృతిగుణాల వేగం ఎక్కువగా ఉన్నప్పుడు శాస్త్రములో చెప్పినది మనకు అవగాహనకాదు. విపరీతార్థాలు వస్తాయి దీనికి మన మనస్సులో ఉన్న దోషమే కారణము.

తల్లిగర్భంనుండి బయటకు వచ్చినది మొదలు స్మశానమునకు వెళ్ళేవరకు మనం అహంకారముయొక్క పిడికిలిలో ఉంటున్నాము. దేవుని పిడికిలిలో లేము. అహంభావన ఎటుత్రిప్పితే అటు తిరుగుచున్నాము. లోపల ఉన్న భగవంతుడు మనకు యజమానిగా లేడు. అహంభావనే మనకు యజమానిగా ఉంది. అహంభావన చేతిలో ఉన్నట్లు నాకు స్పష్టంగా తెలుస్తోంది. అహంభావన చేతిలోఉండి నేను దేవుని చేతిలో ఉన్నాను అని అనుకొంటే నన్ను నేను వంచనచేసుకొన్నట్లే.

ఈ అహంభావననుండి ఏవిధంగా బయటకు రావాలి అని భక్తునిప్రశ్న. దానికి కొత్తగా వాసనలు చేర్చకుండా ఉంటే సరిపోతుంది అన్నారు భగవాన్. నీ అహంభావనపెరిగే మాటలు మాట్లాడవద్దు. అహంభావన పెరిగే పనులు చేయకు. దానికి కొత్తగా మేతపెట్టవద్దు. కొత్తవాసనలను అహంభావనకు చేర్చకు. గత జన్మలనుండి అహంభావనను అంటిపెట్టుకొనిఉన్న పాత వాసనలను తొలగించటానికి ప్రయత్నంచేస్తే నీవు ఒడ్డుకు వస్తావు. ఆ రకంగా నీ అహంభావన నశిస్తుంది. సాధనచేసి నీవు దేవుడిని తెలుసుకోనక్కరలేదు. దేవుడిని తెలుసుకోవటానికి ఏ అహంభావన అయితే అడ్డుగా వస్తోందో దానిని తొలగిస్తే సరిపోతుంది.

దేహం ప్రారబ్దం అనుభవించటానికి ఈ భూమిమీదకు వచ్చింది. దేహం ప్రారబ్దం అనుభవించాక అది పడిపోతుంది. ఈలోపుగా నీవు చేయవలసింది ఏమిటి అంటే దేహంతో తాదాప్యంపొందకుండా నీలోపల ఉన్న చైతన్యముతో తాదాప్యం పొందటానికి ప్రయత్నంచేస్తూ ఉంటే నీదేహయాత్ర సుఖంగా సాగిపోతుంది, నీలోపల ఉన్న చైతన్యము నీకు వ్యక్తమవుతుంది. నీవు మంచిగా ఉండు, చెడుగా ఉండవద్దు అని శాస్త్రము చెపుతోంది. అలా ఎందుకు చెపుతోందిఅంటే అహంభావనలోనుండి విడుదలపొందటానికి మంచితనం సహకరిస్తుంది.

నీదేహప్రారబ్దాన్నిబట్టి ధనం, అధికారం అవి వస్తాయి. వాటినిచూసి విర్రవీగవద్దు. వాటితో తాదాప్యంచెందకు. అవి తాత్కాలికంగా వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. నువ్వు నీ హృదయంలోఉన్న పరమేశ్వరుని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీ జీవితగమ్యంగా పెట్టుకోవాలి. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే సంతోషంవచ్చింది అనుకోండి అహంభావనయొక్క పిడికిలి పెరిగిపోతుంది. ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వచ్చింది అనుకోండి అహంభావనయొక్క పిడికిలి పెరిగిపోతుంది. పొగిడినపుడు పొంగకుండా, విమర్శించినపుడు కృంగిపోకుండా నీ మనస్సును సమానంగా ఉంచగలిగితే అహంభావనయొక్క పిడికిలిలోనుండి బయటపడగలవు.

స్నేహాలుకూడా మత్తులాంటివి అని భగవంతుడు చెపుతున్నాడు. అందువలన స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి, తగుమాత్రంగా ఉండండి. లోకవ్యవహారాలలోకూడా తగుమాత్రంగా ఉండాలి. భగవాన్ చెప్పేది ఏమిటంటే కొత్తవాసనలు ఏమీ తగిలించుకోకు. పాతవాసనలనుండి బయటకు రావటానికి ప్రయత్నం చెయ్యి. మీకు ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, ధనం చెడ్డది అనికాదు, అధికారం చెడ్డది అనికాదు. వాటిని కేవలము స్వప్రయోజనంకోసం కాకుండా ప్రజలక్షేమంకోసం ఉపయోగిస్తే దానివలనకూడా దైవంయొక్క సహాయంవలన నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మీకు ఏమైనా శక్తులు ఉంటే వాటిని సమాజంకోసం సద్వినియోగంచేస్తే దానివలనకూడా మీకు వాసనాక్షయం అవుతుంది. భగవదనుభవం కలగటానికి అవకాశం ఉంటుంది. దీనివలన రెండు లాభములు జీవకోటికి సహాయం చేసినట్లు ఉంటుంది, మీ చైతన్యస్థాయి పెరుగుతుంది. భగవంతుడు ఇచ్చిన శక్తులను కేవలము మీస్వార్థంకోసం ఉపయోగిస్తే మీ చైతన్యస్థాయి పెరగదు, భగవదనుభవం కలుగదు.

కొంతమంది పూజలు, జపాలు చేస్తారు. భౌతికదృష్టితో చేస్తారు. మరణానంతరం గొప్పలోకాలకు వెళ్ళాలని, మంచి జన్మలు రావాలని ఇటువంటివాటికోసం చేస్తారుకాని అజ్ఞానంనుండి బయటపడటానికి వారి సాధనను గురిపెట్టరు. అజ్ఞానంలోనుండి వచ్చే కోరికలను నెరవేర్చటంకోసం దేవుని ప్రార్థిస్తారు.

ఆయన ఆ కోరికలను తీరుస్తాడు. ఇందులో భగవంతుని పొరపాటు ఏమిలేదు. భగవంతుడు అడిగినవాళ్ళకు అడిగినదే ఇచ్చి వూరుకొంటాడు. అడగనివాళ్ళకు అన్నీ ఇచ్చి మోక్షంకూడా ఇస్తాడు అని రమణమహర్షిగారు చెప్పారు.

మనలోపల జీవుడు ఉన్నాడు. ఆ జీవుడికి భోగానుభవం కలగటంకోసం మనం పూజలు చేస్తున్నాము. జీవలక్షణాలను తొలగించుకోవటంకోసం మనం ప్రయత్నంచేయటంలేదు. జీవుడే మనకు నేనుగా వ్యక్తమవుతున్నాడు. ఈ నేనుగా వ్యక్తమవుతున్నవాడు ఎవడు అని విచారణచేస్తే వాడు లేడని నీకు తెలుస్తుంది. నీ సాధన దానిమీద గురిపెట్టాలి. ఈ జీవుడు నిజం అని నీవు అనుకొంటున్నావు. వాడు నిజం అనుకొని వాడికి భోగం కల్పించటంకోసం సాధనచేస్తున్నావు. మానవుడు అజ్ఞానంలోనుండి విడుదలపొందటానికి అసలు ప్రయత్నంచేయటంలేదు. ఇది గ్రహించాలి.

దేహము నేను అనేది మొదటి తలంపు. అదే అహంభావన. ఈ మొదటి తలంపు లేకపోతే ఇతర తలంపులు రావు. మనకి నీర్సం తెచ్చేది, రక్తపోటు తెచ్చేది, గొడవలు అన్నీ తెచ్చేది ఈ అహంభావనే. రాత్రి బాగానిద్రపట్టింది అనుకోండి ఉదయం మనకి మానసికంగా, శారీరకంగా గొప్పబలం వచ్చేసినట్లు అనిపిస్తుంది. నిద్రపట్టలేదు అనుకోండి వెలుగు వచ్చేప్పటికి దెయ్యాలులా తయారవుతాము. నిద్రలో అహంభావన దానిమూలంలో అణిగిపోతుంది. అప్పుడు దాని గొడవ ఉండదు. ఎప్పుడైతే దాని గొడవ లేదో అప్పుడు మనకు శక్తి వస్తుంది. గౌతమబుద్ధుని చూడటంవలన అనేకమందికి జ్ఞానం వచ్చింది. రమణమహర్షిగారి సమక్షంలో కూర్చొంటే మనస్సు పడిపోయేది. దానికి కారణం ఏమిటి అంటే గాఢనిద్రలో అహంభావన లేకుండా నిద్రలో ఉన్నవాడు ఎలా ఉంటాడో జాగ్రదావస్థలో వారు అలా ఉంటారు. అందుచేత వారిదగ్గర కూర్చొంటే శక్తి తరంగాలు మనం ఆపుచేద్దామన్నా ఆగకుండా వచ్చి మనమీద పడతాయి. జ్ఞానికి జాగ్రదావస్థలోకూడా అహంభావన నశించి ఉంటుంది కాబట్టి జ్ఞానిసమక్షంలో శక్తి తరంగాలు, కాంతి తరంగాలు వచ్చి మన శిరస్సును ముంచివేస్తాయి. అందుచేత రమణమహర్షిగారు ఏమని చెప్పేవారు అంటే మీరు పెద్దపెద్ద సాధనలు చేయలేకపోయినా సత్పురుషుల సహవాసం అలవాటుచేసుకోండి అహంభావన అదే ఎండిపోయి రాలిపోతుంది అని చెప్పేవారు.

మనోమూలం అంటే ఆత్మే, దేవుడే, హృదయమే. నీ మనస్సుయొక్క మూలంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు. ఇప్పుడు నీకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. మనోమూలంకనుక తెలిస్తే మనోమూలంలో ఉన్న సర్వేశ్వరుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు. జపం, ధ్యానం, విచారణ చేయవచ్చుకాని అవి గమ్యంకాదు. మనస్సుఉంటే జపం, ధ్యానం చేస్తాము. మనస్సే లేకపోతే జపం, ధ్యానం దేనితో చేస్తాము. మనస్సుఉంటే మార్గం ఉంటుంది. నీవు దేనినైతే పొందాలి అనుకొంటున్నావో దానికోసం సాధనచేస్తూ ఉంటుంది. మనస్సు లేకపోతే ఏదీలేదు. మనస్సు వెనుకవైపు ఏమి ఉందో చూడటానికి అది ఇష్టపడదు. ఏదో కల్పిస్తూ ఉంటుంది. దానికి ఆదర్శం, ఆశయం అనే పేర్లు పెడుతుంది. ఈ కల్పనలు ఉండాలంటే మనస్సును కాపాడుకో.

నీవు మనస్సు కాదు, నీవు దేహం కాదు. అందువలన నీవు మనస్సుగా ఉండటంకంటే, దేహంగా ఉండటంకంటే సూటిగా ఆత్మగా ఉండటంకోసం ప్రయత్నంచెయ్యి. నీవు ఎప్పుడూ ఆత్మవే. నీవు ఏదైతే కాదో దానినిపట్టుకొనేబదులు నీవు ఏదైతే అవునో అక్కడ ఉండటానికి ప్రయత్నంచెయ్యి. మన శరీరమును వస్తువులతో ఎలా అలంకరించుకొంటున్నామో అలాగ మన మనస్సును చదువు, అధికారం, డబ్బు మొదలైనవాటితో అలంకరించుకొంటున్నాము. ఈ అలంకారములలోనుండి జీవుడు బయటకు వస్తేగాని వాడికి జ్ఞానం కలుగదు. మనస్సును ఏ విషయాలతో అలంకరించుకోవాలి అనుకొంటున్నామో వాటికోసం జపం, ధ్యానంచేస్తే అవి నెరవేరవచ్చును కాని జ్ఞానం కలుగదు.

శ్రవణం, మననం, పూజ, జపం, ధ్యానం వీటి అన్నింటియొక్క ధ్యేయం ఒక్కటే. నీ అహంభావన నశింపజేయటమే. నీ ఆధ్యాత్మిక సాధన అంతా అహంభావన తొలగించుకోవటంమీదే గురిపెట్టు. అహంభావన నశించిన వెంటనే స్వరూపం నీకు వ్యక్తమవుతుంది. దేవునికోసం నీవు ప్రయత్నంచేయనక్కరలేదు. ఉన్నవాడు ఆయనే. నీపూజ, జపం, ధ్యానం వీటి అన్నింటి ప్రయోజనం అహంభావన తొలగించుకోవటానికే. బంధము, మోక్షం ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. బ్రహ్మం ఎప్పుడూ ఉంది, సదా ఉంది. సహజంగా ఉంది. అది కొత్తదికాదు. అది బాహ్యంగా లేదు. అది ఎప్పుడో వస్తుంది అనుకొంటున్నావు. అది ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. గుర్తింపు లేక నీకు తెలియటంలేదు.

నేను ఆత్మను తెలుసుకోవాలి అని అంటున్నావు. తెలుసుకొనేవాడు ఒకటి, తెలియబడేది ఒకటి అంటే రెండు అయ్యాయి. మీరు ఒకటిగా ఉన్నారా, రెండుగా ఉన్నారా. నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వస్తే నీవు ఒకటిగా ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తుంది. నిజం అనేది ఎప్పుడూ ఒకటిగా ఉంటుంది, రెండుగా, మూడుగా ఉండదు.

ఇతరులపట్ల మీరు సదభిప్రాయంతో ఉన్నారు అనుకోండి, సహృదయంతో ఉన్నారు అనుకోండి. వారు ఎలాగూ బాగుపడతారు. మీ తలంపు మీకుకూడా ఉపకారం చేస్తుంది. ఇతరులకు భౌతికంగా నీవు సహాయం చేయలేకపోవచ్చును. వారిక్షేమంకోరటానికి దారిద్ర్యం ఎందుకు. భావదారిద్ర్యం పనికిరాదు అన్నారు భగవాన్. భావదారిద్ర్యంవలన బ్రహ్మానుభవం కలుగదు. భావనాబలం ఉన్నవాడికి బ్రహ్మానుభవం కలుగుతుంది.

రంగన్నతల్లి భగవాన్ దగ్గరకు వచ్చింది. భగవాన్‌ను చూసి బైరాగివాడు అనుకొంది. నీకంటే మా అబ్బాయే మెరుగు అంది భగవాన్‌తో. మీఅమ్మ వచ్చి ఇలా అంది అని భగవాన్ రంగన్నతో చెపితే తప్పు అంతా నీదే అన్నాడు రంగన్న. నీవు ఎంతటివాడవో ఆమెకు తెలియనివ్వలేదు. అందువలన ఆవిడ నిన్ను చూసి బైరాగివాడు అనుకొంది. నీవు తెలియజేస్తే నీ గురించి తెలుస్తుంది గాని లేకపోతే ఎలా తెలుస్తుంది అన్నాడు రంగన్న. దేవుడు మనకు కనబడితే మనం చూడగలముగాని ఆయన కనబడకపోతే మనం ఎలా చూడగలము.

వ్యక్తిభావన అంటే నాకు చాలా ఇష్టం అని ఒకరు భగవాన్‌తో చెపుతున్నారు. వ్యక్తిభావన పోతేగాని జ్ఞానం రాదు అని మీరు చెపుతున్నారు. జ్ఞానం రాకపోయినా ఫరవాలేదు వ్యక్తిభావనను పోగొట్టుకోవటం నాకు ఇష్టంలేదు అని చెపుతున్నాడు. వ్యక్తిభావన పోతే నేను ఏమైపోతానో అని నీకు భయం వేస్తోంది. గాఢనిద్రలో నీకు వ్యక్తిభావన ఉందా అంటున్నారు భగవాన్. అక్కడ వ్యక్తిభావన లేకుండా నీవు సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు. జాగ్రదావస్థలో నీవు ధైర్యంచేసి వ్యక్తిభావనను పోగొట్టుకొంటే నీవు శాంతిగా ఉంటావు. అదిపోతే ఏమైపోతాను అని భయపడనక్కరలేదు. వ్యక్తిభావన పోతే అనిర్వచనీయమైన సుఖం, శాంతి వచ్చి నిన్ను వరిస్తాయి. నీవు ఊహించనటువంటి శాంతి, అలౌకికమైన శాంతి, సుఖం నీవు పొందుతావు. వ్యక్తిభావన పోగొట్టుకోవటంవలన నీవు ఏమీ నష్టపోవు. నీవు ఎవరో నీకు తెలుస్తుంది.

మీరు చెప్పేమాటలు నేను ఇష్టపడుతున్నాను. మీరు చెప్పే ఉపదేశాలు విని నేను సంతోషిస్తున్నాను. మీరు అంటే నాకు ఇష్టంగా ఉంది. నాకు ఇష్టంలేనిదల్లా నా వ్యక్తిభావనను పోగొట్టుకోవటం ఇష్టంలేదు అని భగవాన్‌తో చెపుతున్నాడు. అహంభావనమీద మానవునికి ఎంత ప్రీతి ఉంటుందో వాడిద్వారా మనకు తెలుస్తోంది కాబట్టి వాడుకూడా మనకు గురువే. అహంభావనమీద మానవుడికి ఎన్నిరకాలుగా ప్రీతి ఉంటుందో అన్నిరకాల ప్రీతి వాడి నోటిద్వారా బయటకు వస్తోంది.